క్లుప్తంగా

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బస్సు జాత

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన బస్సు జాత నిర్వహిస్తున్నట్లు సీపీఎం మైలవరం మండల కార్యదర్శి కొండయ్య తెలిపారు. ఆదివారం మైలవరం మండల కేంద్రంలో బస్సు జాత కరపత్రాలను ఆవిష్కరించారు. నవంబరు 1వ తేదీన జిల్లాకు రానున్న బస్సు జాతలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గండికోటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో 1999–2002 పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు : మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మండల సభా భవనంలో ఎంపీపీ గుద్దేటి హరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ రాఘవేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభిస్తారని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 11 గంటలకు వీరపునాయునిపల్లెలో రైతు భరోసా కేంద్రం, మరమ్మతులు చెపట్టిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో పూజలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక శివదర్శనానంద మాతాజీ ఆశ్రమంలో విద్యార్థులకు ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీత చదవడంతో మంచి, చెడు తెలుస్తాయన్నారు. మండల స్థాయి పోటీలలో ఐదు కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఎ–కేటగిరిలో సాత్వికారెడ్డి (సాయిరవీంద్ర), బి–కేటగిరిలో పర్వేష్ (సరోజిని), సి–కేటగిరిలో అక్షయ (శ్రీ రవీంద్ర హైస్కూల్), డి–కేటగిరిలో వీరషణ్ముఖ ఆచారి(బాల సత్‌సంఘం), ఈ–కేటగిరిలో విశాలాక్షి (ఆదిత్య) విజేతలుగా నిలిచారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి, డాక్టర్ మూలే రామమునిరెడ్డి పాల్గొన్నారు.

అధ్యయన కేంద్రం తనిఖీ

మైదుకూరు : మైదుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం రాష్ట్ర సమన్వయకర్త ఎస్.అక్బర్ ఆలీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

కరుణించని వరుణ దేవుడు..

- వర్షం రాకపోవడంతో ఆందోళనలో రైతులు
- ఎండిపోతున్న వర్షాధార పంటలు



పంటలకు కాలువలోని నీటిని ట్రాక్టర్ ఇంజన్ సాయంతో పంపింగ్ చేసుకుంటున్న దృశ్యం



ఎండుతున్న సాగు చేసిన పత్తి పంట

ఎర్రగుంట్ల : సాగు చేస్తున్న పంటలు కళ్ల ముందే ఎండిపోతున్న దశలో ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుణ దేవుడు ఎప్పుడు కరుణిస్తారా అని ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రైతులు ఎంతో ఆశతో మినుము, పత్తి, కంది పంటను సాగు చేశారు. ఎర్రగుంట్ల మండల పరిధిలో అన్ని గ్రామాలలో వర్షాధార పంటలను సాగు చేశారు. పత్తి 1240 ఎకరాలలో, మినుము 1950 ఎకరాలలో, కంది 330 ఎకరాలలో సాగు చేశారు. అయితే సమయానికి వరుణదేవుడు కరుణించకపోవడం వల్ల రైతులు ఆందోళనలలో ఉన్నారు. సాగు చేసిన పంటలన్ని కళ్ల ముందే ఎండిపోతుండటం వల్ల తీవ్రమైన మనస్తాపానికి గురి అవుతున్నారు. ఈ సమయంలో మైలవరం దక్షిణ కాలువ వెంబడి సాగు చేసిన పంటలకు మాత్రం కాలువలో ప్రవహిస్తున్న కొద్ది పాటి నీటిని ట్రాక్టర్ల ఇంజన్ల సాయంతో పైపులు వేసుకుని పంటలకు నీటిని సరఫర చేసుకుంటున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి వివరణ కోరగా ప్రస్తుతం సాగు చేసిన వర్షాధార పంటలైన పత్తి, కంది, మినుము పంటలకు వర్షం రాకపోతే ఇబ్బందికరమేనన్నారు. రైతులకు కూడా చాలా ఆందోళనలో ఉన్నారని తెలిపారు.

డ్రైవర్లపై దాడి చేసిన వారిని శిక్షించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు

పులివెందుల రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్లపై హారన్ కొట్టారన్న నెపంతో కావలి పరిధిలోని ఆర్టీసీ డ్రైవర్లు శ్రీనివాసులు, బీఆర్ సింగ్‌పై 14 మంది విచక్షణా రహితంగా దాడి చేశారని, ఇందుకు నిరసనగా పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు గేట్ వద్ద ఎంప్లాయిస్ వర్కింగ్ ప్రసిడెంట్ యూఆర్‌సీ రెడ్డి, కేశవరెడ్డి, ఎస్ఎంయూ నాయకులు ఎం.ఎం.రెడ్డి, డి.పి.రెడ్డి, వి.వి.సి.రెడ్డిలతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : కావలి దగ్గర బస్ డ్రైవర్ రాం సింఘ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జమ్మలమడుగు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. దాడి చేసిన వారిన కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సలహాదారుడు డి.పి.రెడ్డి, రాజశేఖర్ రెడ్డి సభ్యులు మద్దిలేటి, కృష్ణయ్య, వాసు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్తు చార్జీలపై ఉద్యమిస్తాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్తు చార్జీలు తగ్గించేంత వరకు ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన క్షేత్ర స్థాయి ఉద్యమంలో భాగంగా సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలను పెంచబోమని, వ్యవసాయానికి, గృహ అవసరాలకు, పారిశ్రామిక రంగానికి నాణ్యమైన విద్యుత్తు అందిస్తామని పదేపదే హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లలో సర్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, మరిన్ని పేర్లతో అసాధారణ భారం వేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగ ప్రైవేటీకరణను విరమించాలన్నారు. ఇదుకోసం ప్రజలతో సంతకాలు చేయించి గ్రామ, వార్డు సచివాలయాల ఆందోళన ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రాలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సి.సుబ్రహ్మణ్యం కే.సి.బాదుల్లా జిల్లా సమితి సభ్యుడు మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటను తొలగించిన రైతు



మినుము పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతు

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో పాతకుంట మూలారెడ్డి తను సాగుచేసిన 6 ఎకరాల మినుము పంట వర్షం కురవక ఎండిపోతుండటంతో పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. దాదాపు 40 రోజుల క్రితం సాగు చేసిన పంటకు నీటి తడులు అందించే మార్గం కూడా లేకపోవడంతో ఎండిపోతున్న పంటను చూడలేక దున్నేసినట్లు రైతు తెలిపారు. ఎకరాకు దాదపు రూ.20 వేలు నష్టం వాటిలినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : అభివృద్ధి పనుల్లో భాగంగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఎర్రగుడిపల్లెలో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఆదివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పురుషోత్తం, డేనియల్, కోఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, డీఈ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎంపీలకు రుణపడి ఉంటాం



గుండె మార్పిడి చేయించుకున్న కోటేశ్వరరెడ్డి

వేముల : మండలంలోని గుండ్లపల్లెకు చెందిన సుధావతి, రామకృష్ణారెడ్డిల కుమారుడు కోటేశ్వరరెడ్డి గుండె జబ్బుతో బాధపడేవాడు. రామకృష్ణారెడ్డి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కోటేశ్వరరెడ్డిని తిరుపతిలోని పద్మావతి గుండె చికిత్స ఆసుపత్రిలో చేర్పించారు. గుండె మార్పిడి చేయాలని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.12 లక్షలను మంజూరు చేయించారు. శనివారం రాత్రి గుండె మార్పిడి విజయవంతం కావడంతో తల్లిదండ్రులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు రుణపడి ఉంటామన్నారు. ఇందుకు సహకరించిన మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ బయపురెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 25 కుటుంబాలు చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని మహేశ్వర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న జీ సంతోష్‌రెడ్డితో పాటు మరో 24 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి పొట్లదుర్తి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు సారెడ్డి ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, ఉపమండలాధ్యక్షుడు మల్లు మోహన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు దాసరి వెంకటశివారెడ్డి, వై.రాజారెడ్డి, డి. గంగాకృష్ణారెడ్డి, జెక్కు చెన్నకృష్ణారెడ్డి, కె.గంగాధర్‌రెడ్డి, రామాంజనేయ రెడ్డి, నాగేంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెరవేరిన సొంతింటి కల



జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇళ్లు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేవిధంగా జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో భాగంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న స్మార్ట్ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులుకు జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పాటు తన సొంత నిధులతో జగనన్న కాలనీలో ఇంటిని సుందరంగా నిర్మించుకున్నాడు. వైఎస్సార్‌సీపీ నాయకులచే నవంబర్ 1న జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఈ గృహాన్ని ప్రారంభించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఆటవిడుపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీబాలాజీ ఈవెంట్స్, డేకార్స్ బృందావన్ వారి సౌజన్యంతో ధర్మవరం మానస నృత్య కళాకేంద్రం మాస్టర్ మానస ఆధ్వర్యంలో చిన్నారులు జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షించారు. సందర్శకులచే శిల్పారామం కిటకిటలాడింది.

వరుణుడు కరుణించాలని...



పెద్దపసుపులలో నీటిబిందెలతో పూజలు చేస్తున్న మహిళలు



ఎర్రగుంట్లలో నీటిబిందెలతో పూజకు వెళుతున్న మహిలు

పెద్దముడియం : వరుణ దేవుడి కటాక్షాల కోసం మండలంలోని పెద్దపసుపుల, ఎస్.కొట్టాలపల్లె గ్రామాల్లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శక్తి దేవతలైన పెద్దమ్మ, గంగమ్మ అమ్మవార్లకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు భూమి పదునెక్కేంత వర్షం కురవలేదు. కొందరు రైతులు అదును దాటిపోతోందన్న ఆలోచనలతో వర్షం పడకముందే పప్పు శనగ విత్తనం వేశారు. మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో విత్తనం గొర్రు భూమిలో ఇంతవరకు దించలేదు. తేమ శాతం లేకపోవడంతో విత్తనం వేసినా మొలక రాదన్న భయంతో సాగు చేయలేదు. ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా సాగు చేసిన పత్తి, మినుము, మిరప, కంది తదితర పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని పై గ్రామాల ప్రజలు గంగమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : వరుణదేవుడి కరుణ కోసం పట్టణంలోని నడివూరులో ఉన్న బోడ్డురాయి గంగమ్మతల్లి, ఏరువాక గంగతల్లి, అలాగే తుమ్మలపల్లెలో రైతులు, మహిళలు బిందెల్లో నిళ్ల నింపుకుని వర్షం కురిపించాలని పూజలు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

వైవీయూ: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆపస్ జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేషియల్ అటెండెన్స్‌లో గ్రేస్ పీరియడ్ తొలగించడం, సకాలంలో వేయలేదని మెమోలు జారీచేయడం సరికాదన్నారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎస్.చెన్నయ్య మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ బకాయిలు, కరవు భత్యం బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రెడ్డి, జి.వి.సత్యనారాయణ, రామాంజనేయప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం దాదాపు 50 మంది ఆపస్ సంఘంలో చేరినట్లు జిల్లా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.కొండారెడ్డి, ఆర్.వి.జనార్దన్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎరుకలరెడ్డి, బాలనాయుడు, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర స్పందనతో పక్షవాత నివారణ

పులివెందుల : పక్షవాతం నాడీ వ్యవస్థకు సంబంధించిన వ్యాధి. శరీరములోని వివిధ అవయవాలు ప్రయత్నపూర్వక చలనాలను కోల్పోయే రుగ్మతను 'పక్షవాతము' (పెరాల్సిస్) అంటారు. శరీరం బిగుసుకుపోవడం, మూతి వంకర తిరిగి పోవడం, కాళ్లు చేతులు మెలితిరిగి పోవడం, గుండె కూడా పనిచేయకపోవడం ఇలా శరీరంలో ప్రతి అవయవంపై పక్షవాతప్రభావం ఉంటుంది. ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో ఒకరికి వారి జీవిత కాలంలో పక్షవాతం వస్తోంది.అయితే ప్రస్తుతం (టినిక్లిప్లెస్/రెట్రిప్లెస్)ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. దీనిని త్వరగా రోగికి ఇస్తే బ్రెయిన్‌స్టోక్ ద్వారా పెరాలసిస్ ఇతర సమస్యలు వచ్చినా నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఇంజెక్షన్ త్వరగా ఇవ్వాలి



పెరాలసిస్ మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల కానీ, రక్తనాళాలు దెబ్బతినడం వల్ల కానీ జరుగుతుంది. రక్తం గడ్డకట్టడం వల్ల ఉన్న స్థితిని సిటీ స్కాన్ ద్వారా తెలుసుకుంటాం. తర్వాత ఇంజెక్షన్ ఇస్తాం. రక్తప్రసరణ జరగని నాలుగు గంటలలోపు ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల రోగులు పూర్వస్థితికి చేరుకుంటారు. గత 8 నెలల్లో 16 మందికి ఇలాంటి ట్రీట్మెంట్ ఇవ్వగా 12 మంది పూర్వస్థితికి చేరుకున్నారు.

– హర్షవర్ధన్‌రెడ్డి, వైద్యుడు, దినేష్ మెడికల్ సెంటర్

8న విద్యా సంస్థల బంద్

వైవీయూ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయవద్దని, కడపలో మరో పరిశ్రమ ఏర్పాటుచేయాలని కోరుతూ నవంబర్ 8న చేపట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. కడప నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణంలో రెవలూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను మూసివేయాలనుకోవడం దారుణమన్నారు. అదే విధంగా విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేయాలని కోరారు. విశాఖ ఉక్కు పోరాటం నవంబర్ 8వ తేదీన 1000 రోజులకు చేరుకున్న సందర్భంగా కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్ చేపడుతున్నట్లు తెలిపారు.

1 నుంచి యోగా శిక్షణ

కడప కల్చరల్ : స్థానిక పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో నవంబరు 1వ తేదీ నుంచి యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు కె.కల్పన తెలిపారు. వారు మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబెసిటీ సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు.